కథ

# కౌంటర్

పలమనేరు బాలాజీ

**"దొంగ దొరికాడా విజయా" అడిగింది సుజన.**
**బ్యాంకు రద్దీగా వుంది. క్యాష్ కౌంటర్లో డబ్బు సరి చూసుకుంటున్న విజయ తల తిప్పి పక్క కౌంటర్‌లోని సుజనవెపు చూసి నవ్వింది.**
**సుజన ముందో క్యూ, విజయ ముందో క్యూ నిలబడిపోయి వుంది. తన ముందుకు చేయిచాపి నిలబడ్డ వ్యక్తిని చూస్తూ "లెక్క పెట్టుకోండి. ఇరవై మూడు వేలు" అంది డబ్బు అందిస్తూ విజయ.**

---

అతడి కుడి చేయి మరింత ముందుకు రావటం, డబ్బును అందుకునే సాకుతో విజయ చేతివేళ్ళను తడమటం క్షణాల్లో జరిగిపోయింది.

ఉలికి పాటును కప్పి పుచ్చుకుంటూ షాక్ కొట్టినట్లు తన చేతిని గబుక్కున వెనక్కు లాక్కుంది విజయ.

"ఎన్నో పురుగు" లెడ్జర్‌లో లెక్క రాసుకుంటూనే తల పైకెత్తకుండా అడిగింది సుజన మెల్లగా.

మామూలు పురుగు కాదే కందిరీగ. పళ్ళ బిగువున కోపాన్ని, ఛీత్కారాన్ని దాచుకునే ప్రయత్నం చేస్తూ బదులిచ్చింది విజయ. కౌంటర్ ముందు వైపు చూస్తూ బిగ్గరగా "టోకన్ సెవెన్‌టీ" అంది క్యాష్ లెక్కపెడుతూ.

మరో పది హేను నిముషాల తర్వాత కొంచెం తీరిక దొరకడంతో సుజన ఇందాకటి ప్రశ్నను అడిగింది.

"దొంగా" అని సాలోచనగా తల అడ్డం ఆడిస్తూ, "దొరకలేదు సుజనా" అంది విజయ.

"దొరికితే వాడు దొంగెలా అవుతాడే. అయినా వాడు దొరుకుతాడని నాకైతే ఎంత మాత్రం నమ్మకం లేదు. మరి, నీకు" విజయవైపు పరిశీలనగా చూస్తూ అడిగింది సుజన.

విజయ మొహంలో బాధ లీలగా కనపడుతోంది. "కష్టార్జితం కదా, ఎక్కడ పోతుందే,, ఖచ్చితంగా దొరుకుతుంది. చూస్తూ వుండు" అలోచిస్తూనే అంది విజయ. మధ్యాహ్నం లంచ్ బ్రేక్ వరకు ఇద్దరికీ మరి మాట్లాడుకోవటం కుదరలేదు.

సుజన ఏదో మాట్లాడిస్తోంది. కాని భోంచేస్తున్నంత సేపూ విజయకు జరిగిన సంఘటన గుర్తొస్తోంది.

రెండు వారాల క్రితం జరిగిందది.

జీతం తీసుకున్న రోజు సాయంత్రం అనిల్‌కు ఫోన్ చేసింది. "పిల్లలకి పండక్కి బట్టలు కొనాలి కదండీ. మీరు మా ఆఫీసు దగ్గరకు వచ్చేయండి. ఇద్దరం కలిసి ఇట్నించి ఇటే షాపింగ్‌కు వెడదాం" అంది.

"నేను మీ ఆఫీస్ దగ్గరకు వచ్చి మళ్ళీ బజారుకు వెళ్ళాలంటే పెట్రోలు, టైం వేస్ట్ అవుతుంది కదా. నువ్వే బజార్లోకి వచ్చేసి నేతాజీ పార్క్ దగ్గరుండు. నేను అక్కడికొస్తా" లెక్కలు చెప్పుకొచ్చాడు అనిల్.

కళ్ళెగరేస్తూ తల అడ్డంగా ఆడిస్తూ కుడి చేతిని చూసుకుంది విజయ. ఇవేవీ మొగుడికి కనిపించవు కదా అనుకుంటూ సరేనంది ఫోన్ పెట్టేస్తూ.

పావుగంటకు పైగా పార్కు దగ్గర నిలుచుని ఎదురుచూస్తే అప్పుడొచ్చాడు అనిల్. "ఎంత సేపయ్యింది వచ్చి ఆలస్యం చేసానా" అని అంటాడేమో అని ఎదురు చూసింది. కానీ అటువైపు నుండి అలాంటి మాటలూ రాలేదు. జీతం డబ్బు కోసమన్నట్లు చేయి ముందుకు చాపాడు. అలా చాపే ఆ కుడి చేతిని చూసినప్పుడల్లా ఆమెకు తన కుడి చేతిని చూసుకోవడం అలవాటు.

రెండూ అరచేతులే. రెండిటికీ ఉన్నవి ఐదువేళ్ళే. అయినా అతడి చేయికి తన చేయికి ఎంతో తేడా. సంపాదించటంలో కాదు. సంపాదించిన దానిపై అజమాయిషీ చేయటంలో, ఇంట్లో పనులు చేయటంలో, అలా ప్రతిసారి విజయకు అనిపించటం, లోలోపల ఏదో దుఃఖపు తెర ఆమె గొంతుకు అడ్డుపడడం రెండూ మామూలే.

అంత రద్దీగా వున్న బజార్లో, దార్లో హ్యాండ్ బ్యాగ్‌లోంచి డబ్బు బయటకు తీయడం ఎందుకనుకుంది కానీ లేదంటే అక్కడికక్కడే డబ్బు చేతులు మారుండేదే.


"ముందు షాపింగ్ పని చూసేద్దాం. రండి ఇక్కడెందుకు షాప్‌లో ఇస్తాను" అంది.

ఆ మాటే కొంప ముంచుతుందని అప్పుడు తనకు తెలియలేదు. ఆ తర్వాత అట్లా ఎందుకు ఆలోచించానా, అట్లా ఎందుకు అన్నానా, నడి రోడ్డుపైన డబ్బు తీసి అతడి చేతుల్లో పెట్టేసుంటే ఎంత బావుండేదని ఎన్నిసార్లు ఆమె మనసులో అనుకుందో లెక్కేలేదు.

స్కూటర్ పార్క్‌చేసి ఇద్దరూ బట్టలంగడిలోకి వెళ్ళారు. బట్టలు ప్యాక్ చేయించి, క్యాష్ కౌంటర్ ముందు నిలుచుని బిల్లు చెల్లించటానికి హ్యాండ్ బ్యాగ్ తెరిచింది.

సరిగ్గా ఆ క్షణం గుంపులోంచి ఎలా వచ్చాడో కానీ ఒకతను దూసుకురావటం, ఆమె చేతుల్లోని హ్యాండ్ బ్యాగ్‌ని దొరక పుచ్చుకుని పరుగు తీయటం అంతా క్షణాల్లో మెరుపు వేగంతో జరిగిపోయింది.

ఆమె తేరుకుని "దొంగ, దొంగ... పట్టుకోండి"




అని పరుగు పరుగున షాప్ ముందుకొచ్చి, నిలబడి పోయి చుట్టూ చూసింది. జరిగిన సంఘటనతో ఆమె బిత్తరపోయింది. ఒళ్ళంతా చెమటలు పట్టేసాయి.

ఆమె ''దొంగ, దొంగ...'' అని బొంగురు గొంతుతో అరుస్తూనే వుండి పోయింది. ఆమె చుట్టూ గుంపు చేరిపోయిన జనం తలో రకంగా మాట్లాడు తుంటే ఆమె తేరుకుని భర్త కోసం చూసింది. అప్పటికే అతడి మొహం కందిపోయి వుంది. ఆమె వైపు కోపంగా చూస్తూ వున్నాడు.

షాపతను పోలీసు స్టేషనుకు ఫోన్ చేసినట్లు దగ్గ రకు వచ్చి చెప్పాడు.

''మీ బట్టలు తీసుకు వెళ్లండి మేడం. మీరు మాకు రెగ్యులర్ కష్టమర్ కదా. బిల్లు మళ్ళీ ఇద్దురు లెండి'' అని కూడా మాటవరసకన్నట్లు అన్నాడు.

ఆమె వద్దన్నట్లు తలాడించేలోగా అనిల్ విసుక్కు న్నాడు. ''ఒద్దొద్దు లేండి బుద్ధి తక్కువై ఇక్కడికొచ్చాం. ఈ మహాతల్లికి ఒంటిపైన స్వాధీనం కూడా వుండదు. బ్యాగ్ పోయినా అంతే. మనిషిని లాక్కుపోయినా అంతే..''



షాపతను మారు మాట్లాడకుండా షాప్ లోపలికి వెళ్ళిపోయాడు. భర్త మాటలతో విజయకు తల కొట్టేసినట్లు అయిపో యింది.

దొంగ వెనకాలే అతను ఎందుకు పరుగెత్తలేక పోయాడో, తన పక్కనే నిల్చుని వుండి కూడా దొంగను ఎందుకు అడ్డుకోలేక పోయాడో నిలదీసి అడగాలనుకుంది. కానీ తమాయించుకుంది. వస్తున్న ఉక్రోషాన్ని బలవంతంగా ఆపుకుంది.

''బట్టలు'' అంది సందిగ్ధంగా షాప్ లోపలి వైపు చూస్తూ.

''చాల్లే నోర్మూసుకో''.

ఆమాట ఇప్పటికీ ఆమె చెవుల్లో గింగురుమంటూ వుంటుంది. ''అందుకే చెప్తా వుంటాను. అయినా నీ తలకి ఎక్కదు. డబ్బంటే అంత నిర్లక్ష్యం నీకు. సంపా దిస్తే సరిపోదు దాన్ని కాపాడు కోవటం కూడా తెలి యాలి'' కోపంగా, ఆవేశంగా అతడి గొంతులోంచి మాటలు తూటాల్లా దూసుకు వస్తూనే వున్నాయి.

ఆమె తల వంచుకుని వింటూనే వుంది. చుట్టూ జనం అంతమంది మధ్యలో ఆమెని దోషిలా నిలబెట్టి అతడు తిడుతూ వుంటే ఎందుకీ ప్రాణం అని కూడా అని పించింది. ఆమెకు అప్పుడే అక్కడి నుండి ఎంత త్వరగా వచ్చేద్దామా అనిపిస్తుంటే మెల్లగా కదిలింది విజయ.

''ఆగు ఎక్కడికీ? నెల జీతం పోయింది. దాని గురించి కనీసం రవ్వంత బాధ కూడా నీకు వున్నట్లు అనిపించడం లేదు. ఇంద ఈ కాగితంలో సంతకం పెట్టు. బ్యాగ్‌లో ఏమేం పోయాయో మొత్తం రాసివ్వు. పోలీసు అడుగుతా వున్నాడు'' తెల్ల కాగి తాన్ని అందించాడు అనిల్.

కళ్ళ వెంట నీళ్ళు కారిపోతూ వుంటే మౌనంగా ఫిర్యాదు రాసి సంతకం పెట్టి భర్త చేతికి అందించింది.

''ఫోన్ నెంబర్, అడ్రస్ రాసావా'' అని అడుగు తూనే ఫిర్యాదు నొక సారి చదువుకుని పోలీసతనితో ఏదో మాట్లాడి వచ్చాడు అనిల్.

జరిగింది గుర్తుకు తెచ్చుకోవ టంతో మనసులో దుఃఖం పొర్లిపో తుంటే గట్టిగా కళ్ళు మూసుకుంది విజయ.

ఆమె ఎడమ చేతిపైన కుడిచేత్తో తట్టి లేపింది సుజన. ''ఏమి టండి మేడం గారూ... నేను మాట్లాడుతూనే వున్నాను. మీ పాటికి మీరు నిద్రలోకి జారుకునే సారు. రాత్రి లేటయ్యిందా పడుకో వటం''. నవ్వుతూ అడుగుతున్న సుజన వైపు నిరాసక్తంగా చూసి నిర్లిప్తంగా నవ్వే ప్రయత్నం చేసింది విజయ.

మధ్యాహ్నం కూడా ఆలోచించేదే కానీ కౌంటర్లో పని ఒత్తిడి ఎక్కువగా వుండటంతో ఏకాగ్రతతో పనిలో మునిగిపోయింది విజయ.

ఆలోచనల్లో పడి లంచ్ బ్రేక్‌లో బాత్‌రూమ్‌కు వెళ్ళటం కూడా మరచి పోవటంతో వెళ్ళాలనిపించి కౌంటర్ తలుపు మూసి లాక్ చేసుకుని, మరోసారి చెక్ చేసుకున్నాక బాత్ రూం వైపు కదులు తూంటే ఎంత వద్దనుకున్నా క్యూలో నించున్న వాళ్ళ కామెంట్స్ ఆమె చెవిన పడ్డాయి.

''ఈ ఆడోళ్ళందరూ ఇంతేనండి. పట్టుమని పది నిమిషాలైనా కదలకుండా ఒక చోట కూర్చుని పని చేయ లేరు. మనకున్నంత ఓపిక వీళ్ళకెక్కడుంటుంది బాబూ'' అంటున్నాడు ఒకడు సెల్‌ఫోన్‌ని నొక్కుకుంటూ.

''రూల్ ప్రకారం వీళ్ళు కౌంటర్‌ని విడిచి ఎక్క డకు పోకూడదండి. అయినా వీళ్ళను అడిగే వాళ్లెవ రండి'' తెలియని రూల్స్ గురించి మాట్లాడుతున్నాడు ఇంకొకడు.

ఎంతో అవసరమైతే తప్ప కౌంటర్ విడిచి కదలని వాళ్ళ గురించి కూడా సునాయాసంగా, విమర్శనాత్మ కంగా మాట్లాడగలిగే వాళ్ళ ప్రతిభకు ఆశ్చర్యపోతూ బాత్‌రూంకు వెళ్ళి వస్తుంటే – ఇట్లా కామెంట్ చేసిన వాళ్ళని దేనికీ కదలకుండా కౌంటర్లో వుంచి తాళం వేస్తే ఎలా వుంటుందనే ఊహ వచ్చి విజయకు నవ్వొచ్చింది.

నవ్వాపుకోవాలని ఎంత ప్రయత్నించినా కౌంట ర్‌లో బిగుసుకుపోయే వాళ్ళ మొహాలు గుర్తొచ్చే సరికి ఆమెకు నవ్వాపుకోవటం కుదరలేదు.

''ఏమైందే'' అని అడుగుతున్న సుజన వైపు చూస్తూ బిగ్గరగా నవ్వింది విజయ, తర్వాత చెపుతాన న్నట్లు సైగ చేస్తూ, వెళ్ళి కౌంటర్లో కూర్చుంది.

కారణం తెలియకపోయినా ఆమె నవ్వులో సుజన కూడా భాగం పంచుకుంది.

ఉద్యోగంలో చేరిన కొత్తలో ఎవరేం మాట్లాడినా విజయ బెరుగ్గా వుండేది. వెకిలి మాటలకు, వెకిలి చూపులకు, చేతివేళ్ళ తాటింపుకు భయపడి పోయేది. ''కష్టమర్స్‌కు ఎలాంటి అసౌకర్యం కలిగించ కూడదంతే. మీరు అన్నిటినీ కంప్లయింట్ చేస్తూ వుంటే ఎట్లా. ఉద్యో గమన్నాక నలుగురిలోకి వచ్చాక ఇవన్నీ మామూలే. మీరే సర్దుకుపోవాలి లేదా ఇంట్లో వుండాల్సింది''.

తలతిక్కగా మేనేజర్ కొత్తల్లో మాట్లాడిన మాటలు గుర్తొచ్చి చాలాసార్లు లోలోపలే ఏడ్చుకుం టుంటే సుజన ధైర్యం చెప్పి ఓదార్చేది.

మెల్ల మెల్లగా పరిస్థితుల్ని అర్థం చేసుకోవటం విజయకు అలవాటయిపోయిన తర్వాత కష్టమర్స్ అంటే భయం పోయింది.

పైకి హుందాగా గౌరవ ప్రదంగా కనిపించే మగాళ్ళలో ఎంత రాక్షసత్వం, సంస్కారరాహిత్యం వుంటాయో అని మొదట్లో విపరీతంగా ఆలోచించేది. కానీ రోజు రోజుకీ కొత్త కొత్త మనుషుల్ని వాళ్ళు జుగు ప్సాకరమైన ప్రవర్తనల్ని చూస్తూ అన్నింటినీ అర్థం చేసుకో గలగటం, భరించడం నేర్చుకుంది విజయ.

కళ్ళల్లో, మాటల్లో పదును నేర్చుకుంది. పనిలో చురుకుదనం అలవాటు చేసుకుంది.

ఏదైనా సమస్య వచ్చి చెప్పుకుంటుంటే మేనేజర్ ఎంత చులకనగా మాట్లాడుతాడో ఇతరుల ముందు తన స్థానాన్ని తగ్గించటానికి ఎంత హేళనగా మాట్లా డతాడో అర్థమయ్యాక తన సమస్యల్ని తనే పరిష్కరిం చుకోవటం అలవాటు చేసుకుంది.

ఇంట్లో ఎన్ని సమస్యలున్నప్పటికీ వాటి ప్రభావం తన బ్యాంక్ క్యాషియర్ ఉద్యోగం పైన పడ కుండా చూసుకోవటానికి ప్రతి రోజూ విశ్వ ప్రయత్నం చేస్తూ వుంటుంది.

క్యాషియర్ డ్యూటీ చేస్తున్న కొత్తలో కంగారులో పని ఒత్తిడిలో ఐదారు వందలు అప్పుడప్పుడు పోగొ ట్టుకున్నప్పుడు ఇంట్లో, బ్యాంక్‌లో ఆమె పొందిన పరాభవం అంతా ఇంతా కాదు. అప్పటికప్పుడు ఏ రోజుకారోజు అకౌంట్స్ ట్యాలీ చేయడానికి పోగొట్టు కున్న డబ్బును సుజన సర్ది నచ్చ చెప్పి ధైర్యం చెపు తూంటే విజయకు చిన్నతనంగా అనిపించేది.

''బ్యాంక్ క్యాషియర్ అన్నాక ఇవన్నీ మామూలే రా. ఊర్లో మగాళ్ళయినా ఆడవాళ్ళయినా కౌంటర్లో క్యాష్ పోగొట్టుకోవటం చాలా మామూలు విషయం. వీళ్ళంతా ఇప్పుడు నవ్వుతారు కానీ వీళ్ళు కౌంటర్‌లో ఎంతెంత పోగొట్టుకున్నారో తెలుసా నీకు'' అని తన అనుభవాలన్నీ విజయకు చెప్పి ఆమె

భయాన్ని పోగొట్టింది సుజన.

"ఉద్యోగం చేయటం కూడా చేతకాదా నీకు. కూర్చొని డబ్బు లెక్కయ్యటం కూడా కష్టమేనా వందలు వందలు రోజూ నువ్వు పోగొట్టుకుంటూ వుంటే నీ జీతం మొత్తం ఈ అడ్జెస్ట్ మెంట్స్‌కే సరిపోతుంది. దాని కంటే నువ్వు ఈ ఉద్యోగం చెయ్యక పోవటమే మేలు కదా" అని భర్త కసురు కున్నప్పుడు కూడా ఆమెను సుజన ఓదార్చింది.

సుజన స్నేహం, తోడు లేకపోతే తనేమై వుంటుందా అనే ప్రశ్న అప్పుడప్పుడూ విజయకు ఎదురవుతుంటే – అదే అంది సుజనతో.

బదులుగా సుజన నవ్వింది. తెరలు తెరలుగా నవ్వి అంది.

"ఎవరికి ఎవరు తోడు కాదు విజయా. ఎవరికి వారు ఒంటరి వాళ్ళే. మనం అనుకుంటాం కానీ లోకంలో చాలామంది చాలా సమస్యలతో పోరాడుతూనే వున్నారు. పోరాటం ఆగిపోతే బ్రతుక్కో అర్థం లేదు. బాగా ఆలోచించటం అర్థం చేసుకోవటం నేర్చుకో. పరిస్థితులతో పోరాడ్డం నేర్చుకో. నువ్వు అధైర్య పడ్డం మొదలు పెట్టావంటే అదే వైఫల్యం, ఓటమి. ఎప్పుడూ దేనికీ అధైర్య పడద్దు. ధైర్యం నీతోడు కావాలి అంతే".

ఒక్కొక్కటిగా గతంలోని సంఘటనలు సందర్భాలు గుర్తొస్తుంటే వాటిని మననం చేసుకుంటూ బ్యాలన్స్ షీట్ సరిచూసుకుని తృప్తిగా తలాడించింది. విజయ కౌంటర్లోంచి లేస్తూ.

"టీ తాగుదామా –" అంది.

విజయ ప్రశ్నతో ఇద్దరూ కదిలారు.

హోటల్ రద్దీగా వుంది. ఓ మూల కూర్చుని టీ ఆర్డర్ ఇచ్చారు.

పని తాలూకు ఒత్తిడిలోంచి బయటపడే సరికి టీ వచ్చింది. ఇద్దరూ రిలాక్స్ అవుతూ, అక్కడి నుంచి కదిలారు.

"మీ వారు వస్తారా నిన్ను తీసుకెళ్ళటానికి కొత్త స్కూటర్ కదా" విజయ మామూలుగానే అడిగింది.

సుజన విషాదంగా నవ్వింది. మళ్ళీ కాసేపాగి ఈసారి హుషారుగా నవ్వింది.

"మన పి.ఎఫ్. డబ్బుతోనో, మనం తీసుకున్న బ్యాంక్ లోన్‌తోనో బండి కొన్నాడు కదా అని మనల్ని తిప్పమంటే మొగుళ్ళకెలా కుదురుతుంది. ఎక్కడైనా ఎవరికైనా మన బ్యాంక్ అప్పిస్తే అక్కడ ఫలానా బ్యాంక్ వారి ఆర్థిక సహాయంతో, సహకారంతో అని లేబుల్ వుంటుంది. ఆ లెక్కన మన జీవితాల్లో కానీ మన మొగుళ్ళ జీవితాల్లో కానీ, ఇంట్లో నిండిపోయిన వస్తువుల్లో, పిల్లల చదువుల్లో, ఇంటి ఖర్చుల్లో టెలిఫోన్ బిల్, కరెంట్ బిల్, గ్యాస్ బిల్, పాలు, కూరగాయలు, సరుకులు, డిష్ ఫీజ్, కాన్వెంట్ ఫీజ్, ఆటో చార్జ్, న్యూస్ పేపర్, చాకలి పద్దు, ఇంటి అద్దె , వాటర్ బిల్లు ఇట్లా సమస్త అవసరాలకు ప్రతి ఖర్చుకీ మీ ఇంట్లో నీ పేరుతో, మా ఇంట్లో నా పేరుతో లేబుల్ అతికించాల్సి వుంటుంది. చేద్దామా అట్లా వీలవుతుందంటావా?"

ఉండుండి నవ్వుతోంది సుజన.

విజయకు చప్పున ఏం మాట్లాడాలో తోచలేదు. బుర్రలో ఏదో మెరుపు మెరిసినట్లయింది. ఏవేవో లెక్కలు గుర్తొచ్చాయి. ఆదాయాలు, వ్యయాలు, చేయాల్సిన ఆదాలు గుర్తొచ్చాయి.

ఇద్దరూ ఉద్యోగం చేస్తూనే ఉన్నా తన జీతం ఏమవుతుందో ఎప్పుడు లెక్క తెలియదు. సుజన చెప్పిన ఇంటి ఖర్చులన్నీ తన జీతంలోంచే సర్దుబాటు అవుతూనే వుంటాయి. భర్త జీతం గురించి ఎప్పుడూ సరైన లెక్కలుండవు. ఎల్.ఐ.సి. అనో చిట్స్ అనో అనేస్తాడు. అతడి సేవింగ్స్ గురించి తనకు వివరాలూ తెలియవు.

అయినా తన సంపాదనకు, తను భరిస్తున్న ఖర్చులకు ఏ మాత్రం విలువ వుండటం లేదు.

బ్యాంక్‌లో ప్రతి రోజూ లక్షల రూపాయల్ని జమా ఖర్చుల పద్దుల కింద సర్దుబాటు చేసి బ్యాలన్స్ షీట్ ట్యాలీ చేస్తోంది. కానీ ఏ నెల జీతానికి తన వద్ద లెక్కలు లేవు.

జీతం రాగానే జీతం చేతులు మారుతుంది. లేదా ఇంటికి సంబంధించిన సవాలక్ష ఖర్చులకు, ఖర్చయి పోతుంది. "సిటీ బస్, నెలసరి టిక్కెట్ కాకుండా ఇంకేం ఖర్చులుంటాయి? డబ్బెందుకు అవసరం" అని అడిగే భర్త మొహం గుర్తొచ్చేసరికి విజయకు ఉద్రేకం, ఆవేశం తన్నుకొచ్చాయి. పిడికిలి బిగిసింది.

ఏదో చెబుతోంది సుజన.

> **జీతం రాగానే జీతం చేతులు మారుతుంది. లేదా ఇంటికి సంబంధించిన సవాలక్ష ఖర్చులకు, ఖర్చయిపోతుంది. "సిటీ బస్, నెలసరి టిక్కెట్ కాకుండా ఇంకేం ఖర్చులుంటాయి? డబ్బెందుకు అవసరం" అని అడిగే భర్త మొహం గుర్తొచ్చేసరికి విజయకు ఉద్రేకం, ఆవేశం తన్నుకొచ్చాయి.**

"ఎదురు చూడ్డం మానేసాను. విజయా జీవితంలో ఏదో అద్భుతం జరుగుతుందని చాలా కాలమే ఎదురు చూసాను. కాని జీవితం ఎప్పటికీ అలా వుండదని మనమే అద్భుతంగా బ్రతకటం నేర్చుకోవాలని తెలుసుకున్నాను. ఏ సమస్యా నాకుభయాన్ని కలిగించదిప్పుడు. ఏడుపు అసలే లేదు. అన్నీ ఎదుర్కోవటం అలవాటయి పోయింది. స్ట్రగుల్ ఫర్ ఎగ్జిస్టెన్స్ కాదమ్మా ఇప్పుడు స్ట్రగుల్ ఫర్ సక్సెస్".

మధ్య మధ్యలో వింటూ, తన గురించి ఆలోచిస్తూ నడుస్తోంది విజయ.

ఇద్దరూ బస్టాపుకు చేరుకునే సరికి సన్నటి చినుకులు మొదలయ్యాయి.

"ఏమిటీ అకాల వర్షం" అని విజయ అంటుంటే "వర్షానికి ఆనందానికి అకాలమేముందే అమ్మాయ్" అంది సుజన.

"ఇంతకూ బ్యాంక్‌లో ఎందుకు నవ్వావో చెప్పనే లేదు. నేను మర్చిపోతాననుకున్నావా?"

సుజన ప్రశ్నతో మళ్ళీ నవ్వొచ్చింది విజయకు. విసుక్కునే కస్టమర్స్‌ని కౌంటర్‌లో కదలకుండా కూర్చోబెడితే ఎలా వుంటుందనే తన ఊహ గురించి విజయ చెపుతుంటే సుజనకు నవ్వాగింది కాదు.

ముందు సుజన వెళ్ళాల్సిన బస్ వచ్చింది. మొహంలోకి ఏదో వింతగా, కొత్తగా వచ్చిన నవ్వుతో, ఆనందంతో బలంగా హుషారుగా చేయి ఊపింది విజయ.

***

సోమవారం ఉదయం.

కౌంటర్ ముందు పొడవాటి క్యూ.

డబ్బు తీసుకుంటున్న కుర్రాడొకడు కావాలని చేయి తగిలించి పళ్ళికిలిస్తుంటే ఒళ్ళంతా కంపరంగా అనిపించింది విజయకు. గబుక్కున తన చేతిని వెనక్కు లాక్కుంది.

ఆ కుర్రాడి కళ్ళలో ఏదో వింత ఆనందం. పైశాచిక ఆనందం. పొగరుగా తల ఎగరేస్తూ "ఫైవ్ హండ్రెడ్స్ డినామినేషన్ ప్లీజ్" అన్నాడు కుడి చేతిని కౌంటర్లోపలికి చాపి.

విజయకు లోలోపల ఎక్కడో ఏదో కాలుతున్నట్టు అనిపించింది.

మౌనంగా వాడి చేతిలోని నోట్లు తీసుకుని, లెక్కించి ఆ మొత్తానికి ఐదు వందల రూపాయల నోట్లు లెక్కేసి కుడి చేతిలో వుంచుకుంది. ఎడమ చేతిలోకి ఒడుపుగా గుండు సూదినొక దాన్ని పట్టుకుంది. రెండు చేతుల్ని ముందుకు చాపింది. కుర్రాడు చూపులు ఎక్కడో దేనికోసమే తారాడుతున్నాయి.

ఎటో చూస్తూ యథాలాపంగా అన్నట్లు కావాలని చేయి తగిలించి, విజయ చేతిని రుద్దుతూ డబ్బు తీసుకుంటుంటే ఆమె ఎడమ చేతిలోని గుండు సూది కసుక్కున ఆ కుర్రాడి కుడి చేతి వేళ్ళపై దిగబడింది.

కెవ్వున అరిచి మెరుపువేగంతో తన చేతిని వెనక్కు తీసుకున్నాడా కుర్రాడు. వాడి మొహం వాడిపోయింది.

డబ్బును ఎడమ చేతిలోకి మార్చుకుని కుడి చేతివేలుని నోట్లో పెట్టుకున్నాడు. షాక్ కొట్టిన వాడిలా సన్నగా వణికిపోతుంటే అతడి చుట్టూ ఐదారుమంది గుంపు చేరిపోయి ఏమైందంటే ఏమైంది అంటుంటే – ఆ కుర్రాడు తలవంచుకుని "చెక్క ముక్క పొరబాటున గుచ్చుకుంది" అని గొణుగుతూ అక్కడి నుంచి కదిలాడు.

సుజన పక్క కౌంటర్‌లోంచి తల తిప్పి చూస్తూ కళ్ళతో ఏమైందన్నట్టు ప్రశ్నించింది.

"కందిరీగ కుట్టినట్లుంది" మెల్లగా అంది విజయ నవ్వాపుకుంటూ. సుజనకు విషయం అర్థమై నవ్వొస్తుంటే నవ్వకుండా మాట మారుస్తూ "దొంగ దొరికాడా ఇంతకూ" అని అడిగింది. యథాలాపంగా కౌంటర్ ముందున్న క్యూలోని జనాల్ని చూస్తూ.

"ఊ..." అంది విజయ. "నెక్స్ట్ టోకన్ సెవెన్టీ సెవెన్" అని గట్టిగా పిలుస్తూ.

"ఊ... నా? దొంగ దొరికాడా" అంటూ తల తిప్పింది సుజన, ఆశ్చర్యంగా చూస్తూ.

ఇద్దరూ ఒకర్నొకరు చూసుకుంటే ఇద్దరి కళ్ళలో ఏదో వెలుగు మెరిసి మాయమైంది. పెదాల్ని బిగపట్టి నవ్వాపుకున్నారు ఇద్దరూ.

కౌంటర్‌లోంచి ముందుకొచ్చిన చేయి ఎందుకైనా మంచిదని కొంచెం వెనుకగా... ఒద్దిగా... అక్కడే... నిలబడింది...

★

**చిరునామా:**
**కె.ఎస్.బాలాజీ,**
**మండల పరిషత్ అభివృద్ధి అధికారి,**
**6-219, 5వ క్రాస్ గుడియాత్తం రోడ్డు,**
**పలమనేరు – 517 408, చిత్తూరు జిల్లా**
**సెల్: 9440995010**